# అంజామసం



బి. స్వర్ణాంబ

"అంజామసం"....

"వర్ధిల్లాలి!...."

"స్త్రీలకు సమాన హక్కులు...."

"ఇవ్వాలి!...."

శ్రీరామచంద్రమూర్తి ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా కిష్కింధలాగా ఉన్నది. ముగ్గురు పిల్ల వాళ్ళూ కర్రపుల్లలు చేతబుచ్చుకుని, ఒకడు ఒక మాట అంటే, మిగిలిన ఇద్దరూ దాన్ని పలుకుతున్నారు. సీతాలక్ష్మి జాడ ఎక్కడా కనిపించకపోయేసరికి మూర్తికి సందేహం వచ్చింది.

"మీ అమ్మ ఎక్కడరా!" అన్నాడు పెద్దవాడితో.

"అమ్మ పడుకునుంది నాన్నా–" గదికేసి చూపించాడు వాడు.

"ఏమిటి సీతా, ఒంట్లో బాగా లేదా?" అంటూ పలకరించాడు మూర్తి లోపలికి వెళ్ళి.

"ఊఁ....తలనొప్పి...." అంటూ అటు తిరిగి పడుకుంది సీతాలక్ష్మి. రోజూ తను ఆఫీస్ నుండి వచ్చేసరికి కాఫీ కప్పుతో ఎదురొచ్చేది సీత.

'పాపం ఇవాళ చాల నొప్పిగా వుందేమో?' అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళి ఫ్లాస్కులో కాఫీ కప్పుల్లోకి వంచి, రెండు కప్పులతో మళ్ళీ గదిలోకి వచ్చాడు.

"సీతా! కాఫీ త్రాగుతావా! తలనొప్పి మాత్ర వేసుకుంటావా?" అన్న భర్త ప్రశ్నలకు "అబ్బ....ఇప్పుడు మాట్లాడించకండీ!" అంటూ చిరాకు ప్రదర్శించిందామె.

"కాస్సేపు రెస్టు తీసుకో" అంటూ ముందు హాల్లోకి, అదే–కిష్కింధలోకి–వచ్చాడు మూర్తి.

పిల్లవెధవలు ఈ మాటు నినాదాలు ఆపి, "నాన్నా! మేము 'అంజామసం!' అంటాము. నువు 'వర్ధిల్లాలి' అనాలి" అంటూ మూర్తిని చుట్టుముట్టారు.

"ఒరే, అల్లరి చేయకండిరా! మీ అమ్మకు తల నొప్పిగా వుందట" అన్నాడు మూర్తి.

"అంతా, ఉత్తది నాన్నా? ఇప్పటి వరకూ అమ్మ మహిళా సమాజంలో మీటింగులో మాట్లాడింది" అన్నాడు పెద్దవాడు.

"అమ్మ, చాల కోపంగా మాట్లాడింది నాన్నా—" రెండోవాడు. అసలు విషయం అర్థమైంది మూర్తికి.

ఇది అంతర్జాతీయ మహిళా సంవత్సరం.

సీతాలక్ష్మి, మహిళా సమాజంలో జరిగిన మీటింగులో పాల్గొని వచ్చినట్లుంది.

ఇప్పు డామెకు వచ్చింది తలనొప్పికాదు-కోపం!

సమాన హక్కుల కోసం పోరాటమన్న మాట!

పిల్లలు కర్రలు పారేసి, వీధిలో ఎవరో ఆడు కోవడానికి పిలిస్తే పరుగెత్తారు.

"అలిగితివా, సఖీ, ప్రియా!" అంటూ గది లోకి వచ్చాడు మూర్తి. "ఇంతకీ తమరి ఈ అలుక ఏలనో సెలవిస్తే, ఈ దాసుడు తమ ఆజ్ఞ నిర్వర్తించడానికి సిద్ధంగా వున్నాడు—"

మూర్తి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

సీత మంచం మీది నుండి లేచి విసురుగా వంటింట్లోకి వెళ్ళింది. వెనకే వెళ్ళాడు మూర్తి.

"సీతా! ఏమిటి మ. సం. లో ఉపన్యాసం దంచావుట?"

"ఏం దంచితే ఏమిటెండి? ఇంటికి వచ్చాక మా స్థానం వంటింట్లోనే. మేం దంచవలసింది ఈ రోట్లో పచ్చడి—"

సీత కోపం చూసి నవ్వాడు మూర్తి.

"ఓహో! సమాన హక్కుల కోసం పోరాటమా ఏమిటి? ఇప్పుడు మిమ్మల్ని తక్కువ చేసిందెవరు? మీరే అనుకుంటున్నారవన్నీ...."

"తక్కువ చేయలేదూ? ఎంత చదువుకున్నా ఆడవాళ్ళని మగవాళ్ళు నీచంగానే చూస్తారు. భార్యను గౌరవించరు...."

"ఆగు....ఆగు .... ఎప్పుడమ్మా మీ ఆడ వాళ్ళను, మా మగవాళ్ళు నీచంగా చూసింది? సృష్ట్యాది నుండి భార్యలను గౌరవిస్తూనే ఉన్నారు కదా? ఒకాయన ముఖంలో పెట్టుకున్నాడు భార్యను. మరొకాయన గుండెల్లో దాచుకున్నాడు. మరొకాయన, ఇద్దరి భార్యల్లో ఒకావిడను నెత్తి మీదే పెట్టుకున్నాడు. మరొకావిడకు సగం దేహమే ఇచ్చేశాడు. ఎంత గౌరవమిచ్చారు చూడు. మీ సత్యభామ కాలితాపులు తినలేదూ మా కృష్ణుడు? జలజాతాసన వాసవాది సురపూజా భాజనంబై తనర్చు లతాంతాయుధు కన్న తండ్రి శిరము వామ పాదంతో తొలగదోసిందే ఆ సత్యభామాదేవి? అది తగునా? అలా ఎడమకాలితో తన్నినా పల్లెత్తు మాట అన్నాడా పాపం? పైగా, నా పులకలు తగిలి నీ పాదాలకు నొప్పి కలిగిందేమో? అన్నాడు...." మూర్తి. ఆగి ఆ కూజా లోని నీళ్ళు వంచుకుని త్రాగాడు.

"అవన్నీ పాత చింతకాయ పచ్చడి ఉదాహరణలు" కొట్టి పారేసింది సీత.

"సరే....కొత్తావకాయ ఉదాహరణలు విను. మీ వాళ్ళల్లో నన్ను 'మన సీతాలక్ష్మి మొగుడు' అనే తప్ప వ్యవహరించరు కదా? సలక్షణంగా మా నాన్న పెట్టిన శ్రీరామచంద్రమూర్తి అనే పేరున్నా...."

"ఏమో! అదంతా నాకు తెలియదు. ఇది అంతర్జాతీయ మహిళా సంవత్సరం. మా హక్కులు మేము సంపాదించుకుంటాం. ఇక మీ ఆటలు సాగవు."

"కాస్సేపుండు. హాల్లోని బల్ల తెచ్చి ఇక్కడ వేస్తాను."

"ఎందుకు...."

"బల్ల గుద్ది ఉపన్యాసం చెప్పటానికి! సరే... ఇంతకూ మనింట్లో ఏం చేయాలని నీ ఉద్దేశం?"

"ఇక మీదట నెలలో సగం రోజులు మీరు వంట చేయాలి! సగం రోజులు నేను చేస్తాను."



□ మీ యింట్లో రసం, చారు, సూప్ లాంటిది ఏదైనా చేశారనుకోండి. పొరపాటున ఉప్పు ఎక్కువైపోయిందనుకోండి. ఎలా?— కంగారు పడకండి. ఒక బంగాళా దుంప- తీసుకుని చక్రాల్లా కోసి, అందులో పడేసి కాస్సేపు వుంచండి. ఎక్కువైన ఉప్పుని ఆ బంగాళదుంప ముక్కలు పీల్చేస్తాయి! అంతేకాదు – ఆ వంటకానికి కొత్త రుచి కూడా వస్తుంది!



□ ఉల్లిపాయలకు తొక్క ఒలుస్తున్నప్పుడు కళ్ళు మండుతాయి. నిజమే, కాని – వేళ్ళ వేపు నుంచి ప్రారంభించి, పై వైపుకి తొక్క వొలిచి చూడండి – కళ్ళ మంటలు అంతగా వుండవు.

"ఆగాగు....నీకు పన్నెండు రోజులే వస్తాయి కదా?"

"దానికి నన్నేం చేయమంటారు?"

"రక్షించావు. సమాన హక్కుల్లో అది చేర్చ నందుకు థాంక్స్—"

సీత ముఖం కోపంతో ఎర్రబడింది.

"వింటున్నారా? బజారు పనులు సగం రోజులు మీరూ, సగం రోజులు నేనూ....అలాగే పిల్లల పనులూ...."

"సరే....దేవిగారి ఆజ్ఞ! ఎప్పటి నుండి ప్రారంభం చేద్దాం?"

"ఇవాళ 17వ తారీఖు. అంటే పదిహేడు రోజులు నేను చేశాను. రేపటి నుండి మీరు ప్రారంభించాలి." అన్నది సీత.

*

పొద్దున 5 గంటలకు ఎవరో కాలింగ్ బెల్ అదే పనిగా నొక్కడంతో మెలకువ వచ్చింది మూర్తికి.

"సీతా! ఎవరో పిలుస్తున్నారు చూడు!" అంటూ ముసుగు తన్ని పడుకున్నాడు మూర్తి.

"మీరే లేవాలి ఇవాళ! పనిమనిషి వచ్చింది. అంట్ల పాత్రలు పడేయండి–" అంటూ భర్తను కుదిపి లేపింది సీత. మూర్తికి ఒక క్షణం ఏమీ అర్థం కాలేదు.

గబుక్కున లేచి కూర్చున్నాడు. వెంటనే ముందు రోజు జరిగిన సంగతులు జ్ఞాపకం వచ్చాయి.

ఇవాల్టి నుండి ఈ పనులన్నీ తను చేయాలి. "భగవాన్ ఎంత కష్టం తెచ్చిపెట్టావు?" అంటూ లేచి తలుపు తీశాడు.

"ఏందమ్మగారూ! ఎంత పిలిచినా పలకలేదీ రోజు? ఒళ్ళు బాగలేదా?" అంటూ పనిమనిషి పలకరించింది. కానీ ఎదుట అయ్యగారు కనబడ గానే "అమ్మగారికి జ్వరం వచ్చిందయ్యా–" అని అడుగుతూ లోపలికి వచ్చింది. వంటింట్లో, రాత్రి భోంచేశాక వుంచిన గిన్నెలన్నీ అలాగే ఉన్నాయి. "అవన్నీ తీసుకో మంగమ్మా!" అంటూ మళ్ళీ పడుకున్నాడు మూర్తి. అతను అంత చీకట్లో ఎప్పుడూ లేవలేదు. చదువుకునే రోజుల్లో కూడా తెల్లవారుఝామున లేచేవాడు కాడు.

పనిమనిషి తన పని ముగించుకుని వెళ్ళింది. ఇంతలో కొళాయి నీళ్లు వచ్చాయి. అవన్నీ తొట్లోకి పట్టాలి. తొట్టినిండిన తర్వాత ఆ ట్యూబు తీసి బాయిలర్‌కు పెట్టి, మిగిలిన పాత్రలు నింపు కోవాలి. కొంచెం బద్ధకించినా ఇక ఆ రోజుకు నీళ్ళు వుండవు.

"తొట్టి నిండనీ–" అనుకుంటూ అలాగే పడుకున్నాడు మూర్తి. కాస్సేపటికి నీళ్ళు పొర్లి ప్రవహిస్తున్న చప్పుడు విన్పించింది. ఇక లేవక తప్పలేదు. ఆ తర్వాత కాఫీ చేయటానికి వంటింట్లోకి వచ్చాడు. టేబిల్‌సాల్ట్, పంచదార సీసాలు రెండూ ప్రక్క ప్రక్కనే ఉన్నాయి. కాఫీలో టేబిల్ సాల్ట్ వేశాడు. కాస్త రుచి చూశాక కానీ తెలీలేదతనికి. ఆ డికాక్షను పారబోసి మళ్ళీ చేయవలసి వచ్చింది.

అప్పటికే ఎనిమిది గంటలయిపోయింది. మామూలుగా అయితే ఆ సరికి, సీత భోజనం, టిఫిన్, తయారు చేసి కారియర్లలో సర్ది పిల్లల్ని తయారు చేసేది. 8-45 అయ్యేసరికి బస్‌స్టాపులో వుండాలి పిల్లలు. మూర్తికేమీ తోచలేదు. పిల్లలు గోల చేస్తున్నారు. అసలు, స్నానానికే నీళ్ళు కాచలేదింకా.

సీత మాత్రం హాయిగా పేపరు చదువుకుంటూ వాలు కుర్చీలో కూర్చునున్నది.

మెల్లిగా సీత దగ్గరికి వెళ్ళి అన్నాడు మూర్తి.

"సీతా, పోనీ, నావంతు వచ్చే ఈ 13 రోజులూ క్యారియర్ తెప్పించేస్తాను. ఈ వంటా పెంటా ఎవడు చేస్తాడు? పిల్లలు పస్తులుండాల్సిందే.... ఏమంటావ్....?"

సీత కోపంగా అన్నది. "అదంతా కుదరదు. క్యారియర్ తెప్పిస్తే నెలంతా తెప్పించాలి. నేను మాత్రం ఎందుకు కష్టపడాలి?"

మూర్తి గబగబా లోపలికి వెళ్ళి అన్నం చేశాడు. ఆ ఉడికీ ఉడకని మెతుకులు, పెరుగు కలిపి, పిల్లలకు క్యారియర్లో పెట్టి ఊరగాయ వేశాడు. కాంటీన్‌లో టిఫిన్ తినమని రహస్యంగా చెరో రూపాయి ఇచ్చి పంపేశాడు. గబగబా తాను తయారై, "సీతా, అన్నట్టు మరచాను. మా ఫ్రెండొకడు తన పుట్టిన రోజని ఇవాళ లంచ్‌కి రమ్మన్నాడు — నేనక్కడికి వెళ్ళి భోంచేస్తాను. నీవు తినేసి కాలేజీకి వెళ్ళు." అని బయటపడ్డాడు.

అదంతా అబద్ధమని సీతకు తెలుసు.

వంటింట్లోకి వచ్చి చూస్తే ఎక్కడి పాత్ర లక్కడ పడి ఉన్నాయి. ఇల్లంతా అన్నపు మెతుకులు. క్రితం రోజు తీసుకున్న కూరగాయలు ఇల్లంతా పడి దొర్లుతున్నాయి. హనుమంతుడు ధ్వంసం చేసిన లంకలా వుంది వంటిల్లు. గిన్నెలో మిగిలిన అన్నం మెతుకులు పట్టి చూసింది సీత. అసలు ఉడకనేలేదు. పిల్లలు ఆ అన్నమే పట్టుకెళ్లారన్న ఆలోచన రాగానే ఆమె తల్లి మనసు ఆక్రోశించింది. గబగబా వేరే అన్నం వండి, కూర, చారు, చేసి మరో పెద్ద కారియర్లో సర్ది, కాలేజీకి వెళ్ళి గంట పర్మిషన్ తీసుకుని పిల్లల స్కూలుకు వెళ్ళి ఆ క్యారియర్ వాళ్ళకిచ్చింది.

సాయంత్రం మళ్ళీ రంగంలోకి దూకాడు మూర్తి. ప్రొద్దున్న పనిమనిషి అన్ని గిన్నెలతో పాటు అక్కడే ఉన్న నేతి గిన్నె కూడ తీసుకెళ్ళిపోయింది. దాన్నిండా నెయ్యి ఉన్నది. 'ఇలాగైతే పొదుపు బాగానే జరుగుతుంది' అనుకుంటూ మూర్తి వంట తయారు చేశాడు. "భోజనానికి రండర్రా" అంటూ అందర్నీ పిలిచాడు. పప్పు మాడిపోయింది. అన్నం జావయింది. అరటిపళ్ళు తిని పాలు త్రాగారు అందరూ.

*

మరుసటి దినం మెలకువ వచ్చేసరికి ఏడు గంటలయింది. "అరెరే, ఇవాళ ఆలస్యమయి పోయిందే....కొంపదీసి పనిమనిషి కూడా నాగా పెట్టిందా?" అనుకుంటూ గబగబా లేచి వంటింట్లోకి వచ్చాడు మూర్తి.

వంటింట్లో సీత కూరలకు తిరగమోత పెడుతున్నది. పిల్లలు టిఫిన్ తింటున్నారు. "త్వరగా ముఖం కడుక్కొని రండి. కాఫీ కలుపుతాను," అన్నది సీత మూర్తిని చూసి.

మూర్తికి కలో, నిజమో అర్థం కాలేదు. గట్టిగా చేతి మీద గిల్లుకుని చూశాడు. "ఒరేయ్! ఇది మనయిల్లేనట్రా? నేను మీ నాన్ననేనా?" అన్నాడు కొడుకుతో.

"చాల్లెండి. ఏడున్నర కావస్తోంది. మీకేం తొందరలేదు కాబోలు....ఏం? ఇవాళా మీ ఫ్రెండు తన పుట్టిన రోజు విందు కాహ్వానించాడా?" అంటూ నవ్వింది సీత.

"ఆహా! ప్రసన్న వదనం ధ్యాయేత్...." అంటూ బాత్‌రూంలోకి వెళ్ళాడు మూర్తి.



# ప్రమాదం!



చాలామంది పెద్దవాళ్ళు పిల్లల్ని ఎత్తుకుని వాళ్ళను పైకి ఎగరెయ్యడం, పైకి ఎత్తడం వంటివి చేస్తూవుంటారు. పిల్లల్ని నేలకు తాకించి, వెంటనే పైకి (అందెంతవరకూ) ఎత్తుతూ వుంటారు. దానిపేరు పిల్లల్ని "ఆడించడం!" అలా చేస్తూవుంటే– పిల్లలు కూడా, ఆ చేష్ట సరదాగా వుండి పకపకా నవ్వుతూ వుంటారు. అంచేత పెద్దవాళ్ళు వీలైనప్పుడల్లా పిల్లలచేత ఆ 'ఆట' ఆడిస్తూ వుంటారు. అయితే ఇందులో ఎంత ప్రమాదం వున్నదో, ఈ చేష్ట పిల్లలకు ఎలాంటి హాని కలిగిస్తుందో ఎవరికీ తెలీదు. పిట్స్‌బర్గ్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ జాన్ కాఫే–ఈ విషయం మీద అనేక పరిశోధనలు జరిపి–పిల్లల్ని ముఖ్యంగా—రెండేళ్ళ లోపు వయసుగల పిల్లల్ని– అలా ఎగరెయ్యడంవల్ల వాళ్ళ మెదడులోని రక్తం గడ్డకట్టి, మెదడుకు హాని కలుగుతుందనీ, బొమికెలు కూడా దెబ్బతింటాయనీ అందువల్ల ఇలాంటి 'ఆట' ఆడించరాదనీ తేల్చాడు!

"అయితే సీతా, సమాన హక్కుల సంగతి హుళక్కేనా?" టిఫిన్ తింటూ తన సంశయం వెలిబుచ్చాడు.

"మీలాంటి మొగుణ్ణి కట్టుకుని సమాన హక్కులంటే అయినట్టే. పిల్లలు అన్నం, నీళ్ళు లేక మాడిపోరూ? మీరు ఆ హోటల్ మెతుకులు తిని జబ్బు తెచ్చుకుంటే? చూడండి, ఒక రోజుకే అందరూ ఎలా అయిపోయారో!" అన్నది సీత.

"ఏం చేయను? మా అమ్మ నాకు చిన్నప్పుడు వంట నేర్పలేదు. ఇప్పుడు నువూ నేర్పలేదు. పోనీ మీ మహిళా సమాజంవాళ్ళు మా మగవాళ్ళకు వంట క్లాసులు ప్రారంభిస్తేనో!" మూర్తి మాటలకు నవ్వింది సీత.

"అసలు పాక కళ మాది కాదండీ....మీ మగవాళ్ళదే. నలపాకం, భీమపాకం అంటారు కానీ ద్రౌపది పాకం, సీత పాకం అనరుగా...."

"అయితే నా మీద కోపం పోయినట్టేనా?" మూర్తి మాటలకు నవ్వుతూ, "కానివ్వండి; మళ్ళీ ఇదంతా సర్ది నేనూ తయారు కావాలి" అన్నది సీత.

ఆ రాత్రి తన స్నేహితురాలికి ఉత్తరంలో ఇలా వ్రాసింది: "ఆయన కట్నం తీసుకోలేదు. నన్ను ఉద్యోగం మానమనలేదు. మానేస్తానంటే వెంటనే ఒప్పుకుంటారు కూడా. డబ్బంతా తనపేర బ్యాంకులో వేయాలనీ, 'నీవు ఖర్చు పెట్టుకో కూడ'దనీ శాసించలేదు. భర్తలాగా శాసించకుండా, మిత్రునిలాగా ఆప్యాయంగా చెబుతారు ఏ విషయమైనా. మా మహిళా సమాజంలో 'సమాన హక్కుల కోసం పోరాడుదాం' అని తీర్మానాలు చేశారు కానీ, ఎంత పోరాడినా, ఎన్ని శాసనాలు చేసినా, సంస్కారం జన్మతః రావాలి. నా భర్తను అంత సంస్కారం గలవారిగా, మా అత్తగారు తీర్చిదిద్దింది. నా పిల్లలనూ అలాగే తయారుచేస్తాను. వాళ్ళ జీవిత భాగస్వామినులను ఆప్యాయంగా చూసుకునేలా చేస్తాను. అది చాలదూ? ప్రతి తల్లీ తన బిడ్డలను ఇలా తీర్చి దిద్దితే, సంసారాలు సౌఖ్యవంతమవుతాయి ప్రభుత్వం తీసుకురావలసిన రాజకీయమైన సంస్కరణల గూర్చి నా కంటే పైఅంతస్తులోనివారు పోరాడుతారు. ఎవరి కుటుంబం వారు బాగు చేసుకుంటే దేశం దానంతటదే బాగుపడుతుంది. కదూ ఉమా?...."

హాయిగా నిద్రిస్తున్న భర్తనూ, పిల్లలనూ చూసి తృప్తిగా నిట్టూర్చింది సీత. □□□

## విద్యార్థినులకు ప్రత్యేకం:

కాలేజీ, హైస్కూళ్ళలో చదువుతున్న విద్యార్థినుల కోసమని "వనిత" ప్రతి సంచికలోనూ రెండు పేజీలు కేటాయించదలచుకున్నామని తెలియజెయ్యడానికి సంతోషిస్తున్నాము. ఈ పేజీలలో ఆయా స్త్రీల కాలేజీ, హైస్కూళ్ళకు చెందిన కార్యక్రమాలు, సమావేశాలు మొదలైన వార్తలతోపాటు, సాహిత్యం, సంగీతం, ఆటలు — మొదలైన వాటిల్లో జరిగే పోటీలలో గెలుపొందినవారి ఛాయా చిత్రాలు; అలాగే మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థినుల ఛాయా చిత్రాలు, విద్యార్థినుల చిన్న చిన్న రచనలు మొదలైనవి ప్రచురిస్తాము. విద్యార్థినులు, కాలేజీ హైస్కూళ్ళ అధికారిణులు మాతో సహకరించవలసిందిగా కోరుతున్నాము. ఈ శీర్షికకు విద్యార్థినులు పంపే ఎలాంటి అంశమైనా, అందులో విద్యార్థిని పేరు, చదువుతున్న క్లాసు, హైస్కూలు లేదా కాలేజీ పేరు వగైరా వుండాలి. కాలేజీ, హైస్కూళ్ళకు సంబంధించిన వార్తలు, ఛాయా చిత్రాలు పంపేటప్పుడు హెడ్‌మిస్ట్రెస్ లేదా ప్రిన్సిపాల్ సంతకంతో పంపాలి. పంపే కవరుపైన 'విద్యార్థినుల శీర్షిక' అని పైన రాయాలి. [వ. సం]